# పరిష్కారం

శ్రీ సింగరాజు రామచంద్రమూర్తి

వరండాలో కూర్చుంది పద్మావతి. కాంపౌండులో రక రకాల వయస్సు పిల్లలు ఆడుకుంటుంటే వాళ్ళతోపాటు తనూ లీనమయిపోయింది అందులో—వాళ్ళకి సలహాలిస్తూ!

ఎవరు ఎక్కువదూరం దూకగలరోనని పందెం వేసుకుని ఒక్కొక్కరే పరుగెత్తుకుంటూవచ్చి బరిమీద పాదం వేసి ఎగిరి దూకుతున్నారు. అంతవరకు ఎక్కువదూరం దూకిన వాళ్ళకి మట్టికు మట్టిలో ఒక గుర్తు పెట్టిస్తోంది పద్మావతి. ఎవరయినా తప్పుగా అడుగువేస్తే చెప్పడం కూడా ఆవిడ వంతే కావడాన నిశితంగా వాళ్ళని పరిశీలిస్తోంది.

అందరూ అయిపోయారు. అంతలో పద్మావతికి వెనక పక్కగా ఆమె కొంగు పట్టుకుని నిలబడ్డ బాబు గభాలున ముందు కొచ్చి, "నే గూడా దూకుతా!" అన్నాడు ఆమెతో.

ఫక్కున నవ్వొచ్చింది ఆవిడకి.

"నువ్వు దూకలేవుబాబూ" అంది వాడిచేత ఆ ప్రయత్నం మానిపించే ప్రయత్నంలో.

"ఏం దూకలా—నే గూడా దూకుతా!"

ఏం అంటే ఏమ్వం అన్నమాట. వాడు బాబుకన్న కొంచెం పెద్దవాడు.

"నువ్వు అందరికన్న చిన్నవాడివి బాబూ! ఆనిక మనిద్దరం దూకుదాం—సరా?"

కాని, వాడికి ఆ 'చిన్నితనం' ఏమిటో అంతుపట్టలేదు. పైగా తన్నేదో అవమానించేస్తున్నట్టుగా అనుమానం కూడా వచ్చింది. దాంతో ఏడుపు ప్రారంభిద్దామని కింది పెదవి విరిచాడు. వాడి ప్రయత్నం గబుక్కున కనిపెట్టేసింది పద్మావతి.

"సరేరా నా తండ్రీ, దూకుదుగాని పద" అని తను కూడా లేచి వాడిని వెంట పెట్టుకుని బరి దగ్గరకు తీసుకుపోయింది.

వాడి నక్కడ నుంచోపెట్టి "దూకు" అంది.

కాని వాడి కది నచ్చలేదు. "పలుగెత్తాలి!" అన్నాడు.

ఫకాలున నవ్వేసింది పద్మావతి. "సరే, పరుగెత్తుకురా. నేను ఇక్కడే ఉంటా" అంది.

వాడు ఒక ఇరవయి గజాలు వెనక్కి వెళ్ళాడు. పిల్లలందరూ వాడు దూకలేకపోతే ఏడిపించేద్దామని సిద్ధంగా ఉన్నారు.

"ఊ! ఇక చాల్లే, పరుగెత్తుకురా" అంది పద్మావతి.

వాడు పరుగెత్తడం మొదలెట్టాడు. కాని, తీరా బరి దగ్గరకు వచ్చేసరికి లాగువూడి జారిపోయి, కాళ్ళకి అడ్డంపడి కిందపడబోయాడు. గభాలున పట్టుకుంది పద్మావతి.

అందరూ గొల్లున నవ్వేశారు.

బాబు బావురుమని ఏడుపు లంకించుకున్నాడు. పద్మావతి కూడా మరీ నవ్వితే వాడు ఇంకా ఏడుస్తాడని, అందరినీ నవ్వద్దని కసిరి, గభాలున వాడిని ఎత్తుకుని లాగు తొడిగింది.

"ఏం జరిగిందినాన్నా" అంటూ హడావుడిగా వచ్చింది బాబు వాళ్ళ అమ్మ.

"ఏంలేదండి అక్కయ్యగారూ! వాడు కూడా దూకుతానన్నాడు. తీరా పరుగెత్తేసరికి లాగువూడిపోయింది" అంటూ పకపక నవ్వింది పద్మావతి.

కాని, తల్లికిమాత్రం వాడి కళ్ళనిండుకున్న నీళ్ళు చూస్తే నవ్వు రాలేదు. మాట్లాడకుండా ఎత్తుకుని లోపలికి తీసుకెళ్ళిపోయింది.

వాళ్ళు వెళ్ళిన దిక్కే చూస్తూ, ఉస్సురని నిట్టూర్చింది పద్మావతి.

అప్పుడేవచ్చి, ఈ ఆఖరి దృశ్యాన్ని చూసిన ఆనందరావు పద్మావతి భుజంమీద చేయివేసి, "లోపలికిపోదాం పద" అంటూ మెల్లిగా కదిపాడు........

ఒక్కసారి నీటి తెరలగుండా అతనివంక చూసింది పద్మావతి. మాట్లాడకుండా తలవంచుకుని లోపలికి నడిచింది. ఆనందరావు ఆమెను అనుసరించాడు.

సోఫాలో కూర్చుని బూటు లేసులు విప్పుకుంటున్న ఆనందరావు మనస్సులో మళ్ళీ ఇందాకటి సన్నివేశం మెదిలింది. పద్మావతిమీద జాలి కలిగింది. ఆలోచనల్లోకి జారిపోయాడు.

"డబ్బు లాగానే సంతానం కూడా కావలసినవారికి ఉండదు. అక్కరలేనివాళ్ళకి కుచేల సంతానం కలిగిస్తాడు భగవంతుడు.

తమ కాపురంలో 'లోటు' అనేదిలేదు—పిల్లలు లేకపోవడం తప్ప. తనకి పెద్ద హోదాగల ఉద్యోగం, కారు—అందమయిన మేడలో ఉండటం అందంలో తను చాలా బాగా ఉంటాడని చాలామంది అభిప్రాయం. ముఖ్యంగా తనతో చదువుకున్న ఆడపిల్లలు తనతో మాట్లాడాలని అభిలషించేవారు—అదే తన అందానికి గీటురాయి. రెండు 'ల' కారాలు దాటే పొలాలు నగయురా లున్నాయి. రొష్టు పెట్టని తలితండ్రులు.

ఇక పద్మావతిమాత్రం......తను కేవలం ఆమె అందాన్ని చూసే చేసుకున్నాడు. దానికితోడు చదువుకున్నది. 'చిలకా గోరింకలు' అన్న పేరు సర్వ విధాలా సార్థకంచేసే దాంపత్యం తమది. కాని, ఒక చిలకపిల్ల లేకపోవడమే నలుగురికీ కనబడే లోపం!

అదే పద్మావతి దిగులు కూడా!....

"మనం ఒకటయి ఇంకా నాలుగేళ్ళయినా కాలేదు—అప్పుడే అంతగా దిగులుపడితే ఎలా పద్మా! అసలు ఇంగ్లీషు వాళ్ళ పద్ధతి ఏమిటో తెలుసా? అయిదారేళ్ళపాటు పిల్లలుండ కుండా స్వేచ్ఛగా విహంగాల్లా గడిపేయడం. అప్పుడు ఈ జీవితంలోకి మరొక ఆకర్షణ ప్రవేశపెట్టుకోవడానికి సంతానం, వాళ్ళతోటి బాదరబందీ!" అని ఎన్ని నచ్చచెప్పినా పద్మావతికి తలకెక్కవు. ఆమెకి కావలసింది ఇంట్లో సరదాగా తిరిగే పిల్లలు! వాళ్లే లేనప్పుడు లోకంలోని సౌఖ్యాలన్నీ అందుబాటులో ఉన్నా ఆమె కేదో వెలితి ఉండనే ఉంటుంది.

అందుకనే తామే వూళ్లో ఉన్నా, ఇంటిచుట్టు పక్కల నున్న పిల్లలెప్పుడూ పద్మావతిచుట్టూ ఉండేవారు. వాళ్ళని తనవైపుకు ఆకర్షించుకునేందుకు ఆమె పడేపాట్లు చూస్తుంటే తనకి ఒక్కొక్కసారి నవ్వు కూడా వస్తుంటుంది. ఇంటి నిండా బిస్కట్లు, చాకలెట్లు ఉంచుతుంది, ఎప్పుడూ తియ్య కుండా. ఇద్దరూ కలిసి బజారుకి వెళ్ళినప్పుడు బిస్కట్లుకొం టుంటే ఆమెని కేవలం ఏడిపించాలని అడుగుతుండేవాడు తను, ఎందుకు పద్మా, ఇన్ని చిరుతిళ్ళు. మనం ఇద్దరమేగా" అని.

అందుకు నవ్వేసి, "నాకు చిన్నతనంనుంచి ఇవి అలవా టండీ, అంతగా ఈ ఖర్చు మీరు భరించలేనంటే మా నాన్నకి రాస్తాను—నాకు బిస్కట్లకి డబ్బివ్వడంలేదు నాన్నోయ్ అని" అనేది

"నిన్న నాకు అప్పజెప్పేప్పుడు "మా అమ్మాయికి మొండి పట్టుదల కొంచెం ఎక్కువ నాయనా, గారాబంగా పెరి గింది" అన్నారేగాని, ఈ విషయం చెప్పలేదు సుమీ !" అని ఫక్కున నవ్వేసేవాడు తను.

ఈ ఇంట్లోకి వచ్చి సంవత్సరం దాటుతోంది. రోజూ మధ్యాహ్నం పూట పిల్లలందరినీ పోగుజేసి బిస్కట్లపార్టీ పెడుతుంటుంది పదావ్మతి. ముఖ్యంగా ఆమెని ఆకర్షించినవాడు పక్కింటివారి బాబు.

"మన అదృష్టం బాగుండి, ఇటువంటివాడు పుడితే నా స్వామికి నిలువు దోపిడ ఇవ్వనూ" అంటుంది వాడిని ఎత్తుకుని.

కాని, తనకిమాత్రం వాళ్ళనెవరినీ చూడ బుద్ధికాదు.

ఇలా పిల్లలమీది వెర్రి మోజుతో అప్పుడప్పుడూ కొన్ని మాటలు కూడా పడిందికాని, ఆ వ్యామోహంలో పట్టించు కోదు.

ఒకసారి బీచీ సెంటరులో పిల్లల ప్రదర్శన పెడు తుంటే తా మిద్దరికీ ఆహ్వానం వచ్చింది. సరిగా బయలుదేరే ముందు ఆమె కెందుకు తట్టిందో గభాలున పక్కింటి వారింటికి పరుగెత్తి బాబుని ఎత్తుకొచ్చింది. తన కర్థమయిపోయింది ఆమె ప్రయత్నం. కాని కాదంటే కష్టపడుతుందని తాపీగా మళ్ళీ సోఫాలో కూలబడ్డాడు.

అక్కడనుంచి వాడికి ముఖం రుద్దింది, మేకప్ చేసింది. వాడికోసమని మిషన్‌మీద ఇదివరకే కుట్టిన బట్టలు తొడిగి ఎత్తు కుని "బయలు దేరండి" అంటూ వెళ్ళి కారులో కూర్చుంది.

మాట్లాడకుండా కారు స్టార్టు చేశాడు తను.

ఆ పిల్లల పోటీలో బాబుని కూడా పెట్టింది పద్మావతి. బొద్దుగా, అందంగా ఉన్నాడేమో—వాడికే మొదటి బహుమతి వచ్చింది.

పద్మావతి ఆనందానికి అంతులేదు. కాని, తనకిమాత్రం మనసులో పీకుతూనేఉంది. పరాయి పిల్లాడ్ని ఇలా నలుగురిలోకి తెస్తే వీడికి కాల్లో ముల్లుగుచ్చుకున్నా మాట పడాలసివస్తుంది.

తను భయపడినంతా అయింది. ఇంటికొచ్చి, వాడి నెత్తుకుని, ప్రైజు పుచ్చుకుని గర్వంగా పక్కింటి కెళ్ళిన పద్మావతి వాడిపోయిన ముఖంతో తిరిగొచ్చింది. లాలించి ఆరా తీస్తే తేలిన విషయం—వాడికి ఒళ్ళు కొద్దిగా వెచ్చబడిందని, నలుగురిలోకి తీకుకెళ్ళడంవలన దృష్టి కొట్టి జ్వరం వచ్చినటు వాళ్ళఅమ్మ అన్న దనీను.

నిజానికి తను చాలా రోజులుగా చూసున్నాడు—బాబుని పద్మావతి గారాబం చేయడం. వాడు కూడా స్వంత తల్లిదగ్గర కన్నా పద్మ దగ్గరే చనువుగా ఉండటం వాడి తల్లికి నచ్చనటు ఆ ముఖంలోనే స్పష్టంగా అగపడేది. అది సహజం కూడా! తల్లి తన పిల్లల ప్రేమంతా తనమీదే కేంద్రీకృతమవాలని కోరు కుంటుంది. అందులో ఇతరులు ఏమాత్రం భాగం పంచుకున్నా సహించదు, సహించలేదు.

కాని, వాడిని పద్మావతికి ఇవ్వకుండా ఉండలేదు కూడా ఆవిడ— కారణం వాడికి పద్మచేసే పోషణ. వాడీనాడు ఇంత ఆరోగ్యంగా ఉన్నాడంటే అందుకు పద్మావతే బాధ్యురాలు. రోజూ ఉదయం వాడిని ఎత్తుకొచ్చేసి, హార్లిక్స్ పెడుతుంది. ఖరీదయిన బిస్కట్లు పెడుతుంది. సరే, వాడికోసం రక రకాల బట్టలు కుడుతుంది. ఒక్కొక్కరోజున వాడిని ఆడపిల్లగా తయారు చేయాలని మనస్సుపుడితే అప్పటికప్పుడు పరికిణీ, జాకెట్టు తయారుచేసి వాడికి, తొడిగి, కళ్ళనిండా కాటుకపెట్టి తన సరదా తీర్చుకుంటుంది.

చిత్రమేమిటంటే అలా వాడికి కుట్టిన బట్టలు మళ్ళీ ఆమె కంటబడవు. ఆ విషయం పద్మావతి పట్టించుకోదు కూడా!

ఇన్ని లాభాలున్నందువలననే పద్మావతి బాబుని తీసుకు వస్తుంటే లోపల ఎంతగా అయిష్టంఉన్నా, బయట పడదు. ఆవిడ!

తనకీ విషయాలన్నీ తెలుసు. కాని, పద్మ సరదాలకి తను ఎన్నడూ అడ్డురాడు. ఆమె మనస్సు కష్టపడితే తను సహించలేడు!

ఈ సమస్యని ఒక రకంగా పరిష్కరించేందుకు మార్గం తను అనుకున్న ప్రకారం నడవడమే. కాని ఆమాట అందా

మంటే పద్మ ఏమనుకుంటుందో నన్న భయం పరిష్కారాన్ని వాయిదా వేయిస్తోంది.

ఆలోచనల్లోంచి బయటపడిన ఆనందరావుకి పద్మావతి జాప్యం ఆశ్చర్యాన్ని కలిగించింది. గభాలునలేచి, వంటింట్లోకి వెళ్ళాడు.

స్టవ్‌మీది నీళ్ళు మరిగిపోతున్నాయి. అదేమీ పట్టనట్లుగా నీలంగా వెలిగే ఆ మంటల్లోకి తదేకంగా చూస్తోంది. ఆమె ముఖంలోని విచారంచూసి భయపడ్డాడు ఆనందరావు. మెల్లిగా వెళ్ళి ఆమె భుజంమీద చేయి వేశాడు. ఉలిక్కి పడింది.

"ఎందుకు రాణీ, ఆ పరధ్యానం? అలా బయటికి పోదాం రా—ఏదైనా పిక్చరుకి."

మాట్లాడకుండా కాఫీనీళ్ళు దించి, ఫిల్టర్‌లోపోసి, పాలు ఎక్కించింది. ఒక్కక్షణం ఆలోచించాడు ఆనందరావు—

"చూడు పద్మా! పరాయి పిల్లలు మన పిల్లలెలా అవుతారు? వాడిని మనం ఎంతగా గారాబం చేసినా 'అమ్మా' అని ఆవిడ్నే అంటాడుగాని నిన్ననడుగదా!" అన్నాడు.

ఆశ్చర్యంతో అతనివంక చూసింది పద్మావతి.

ఖంగారుపడ్డాడు ఆనందరావు. కాని తను చెప్పవలసిన దానికి ఇదే అదును అనిపించింది అతనికి.

"మనకి పెళ్ళయి ఇంకా నాలుగేళ్ళయినా కాలేదు—అప్పుడే ఏదో వయసుడిగిపోయిన వాళ్ళలా పిల్లలకోసం అలా దిగులు పడతామేం? అయినా ఇప్పటినుంచి పిల్లలు, ఆ జంజాటంలో నువ్వు పడిపోవడం నేను సహించలేను. కాని ఇల్లు నిండినట్లు ఉండాలంటే పిల్లలే అందం అంటారు మరి. ఆ మాట నిజమే. ముఖ్యంగా నే నింట్లో లేనప్పుడు నీకు బాగా కాలం గడుస్తుంది. అందుకనే నా కొకటి అనిపిస్తోంది"—ఆనేశాడు.

"ఏమిటి?" అనడిగింది పద్మావతి కుతూహలంతో.

"ఎవరినయినా పెంచుకుంటే?"

తెల్లబోయి చూసింది అతనివంక.

"అదికాదు పద్మా నే నవేది—'పెంపు' అంటే నా ఉద్దేశం అదికాదు. అనాథ శరణాలయాల్లో అందమయిన పిల్లలుంటారు. రక రకాల వయస్సుల వాళ్ళుంటారు. అందులో మనకి కావలసినవారిని ఏరుకోవచ్చు. వాళ్ళు మనతో కలిసిపోతే చేసుకోవచ్చును. లేకపోతే మళ్ళీ వాళ్ళకి అప్పజెప్పేయచ్చు. దీనివలన మనకి లాభం కూడా ఉంటుంది. నిజంగా ఎవరి దగ్గరినుంచో దత్తతకి తీసుకున్నామనుకో—వాళ్ళు చూసేది కేవలం మన ఆస్తిని. ఆస్తిమీద కన్నేసే మనకి పిల్లల్ని ఇస్తారు. సరే! ఆ తరువాత మన అదృష్టం బావుండి, మనకి ఒక పాప పుడితే అప్పుడు వీళ్ళ నిజ స్వరూపాలు బయట పడతాయి. కేవలం ఆస్తిచూసి, ఇచ్చినవాళ్ళు మన ఆస్తికి వారసులు పుట్టగానే రాక్షసుల్లాగా ప్రవర్తించేందుకు వెనకాడరు. అది ప్రమాదం కూడా! కాని, ఈ అనాథ శరణాలయంనుంచి తీసుకువచ్చిన పిల్లలకి మన ఆస్తిమీద ఎప్పుడూ ఎటువంటి హక్కు ఉండదు. మనం ప్రేమగా పెంచితే మన కన్నబిడ్డలా కలిసిపోతారు. ఒక పని చేసే పిల్లగా పెరగమన్నా పెరుగుతారు. అంతా మన మనస్సులమీద ఉంటుంది. దిక్కులేనివాళ్ళకి కావలసినది ఆదరణ మాత్రమే."

మాట్లాడకుండా వింటోంది పద్మావతి. ఆమె ముఖంలోని ప్రసన్నత అతనికి మరింత ధైర్యానిచ్చింది.

"ఇందులో కేవలం స్వార్థం—అంటే కొంతలో కొంత మనకి పిల్లలు లేనికొరత తీరడంతోపాటు పరమార్థం కూడా ఉంది. ఒక అనాథనితెచ్చి, వ్యక్తిగా నలుగురిలోనూ నిలబడేట్టు తయారు చేద్దాము. మనకి భగవంతుడు అలా చేయగల ఆర్థిక స్తోమతు నిచ్చాడు. నీఇష్టం—ఆలోచించుకో" అన్నాడు.

పద్మావతి కాఫీ కలిపి అతనికి కప్పులోపోసి, చేతి కందించింది. ఆనందరావు ఆమె అభిప్రాయంకోసం ఎదురుచూస్తూ కాఫీ గుటకలు వేయసాగాడు.

క్షణాలు భారంగా నిమిషాలుగా మారుతున్నాయి.

చివరికి పద్మావతి తలెత్తి, "సరే మీ ఇష్టం!" అంది.

"అలా అంటేకాదు పద్మా, ఇది కుక్కపిల్లని పెంచినట్లుకాదు. కొంత ఆనందంతోపాటు, కొన్ని బరువు బాధ్యతలు కూడా స్వీకరించాలి మనం. అందుకు నువ్వు, సిద్ధంగా ఉన్నావా?"

"ఊ! సిద్ధంగా ఉన్నాను. నేను పిల్లలమధ్యన పెరిగాను. నాకు కావలసింది ఇంట్లో పిల్లల సందడి" అంది తలవంచుకుని.

ఆనందరావుకి చాలా సంతోషం కలిగించాయి ఆ మాటలు. గబుక్కున ఆమెకి దగ్గరగా జరిగి, "రాణిగారిది చాలా జాలి గుండె. అనాథ సంరక్షణి, చల్లని తల్లి" అన్నాడు ఆమెను చేతో చుట్టేస్తూ.

"రేపు పెంపకంపిల్ల వచ్చిన తరువాత మీ కిటువంటి అవకాశాలు ఉండవు జాగ్రత్త" అని ఫక్కున నవ్వింది పద్మావతి.

"పెద్దవాళ్ళు మాట్లాడుకుంటుంటే, చిన్న పిల్లలు లోపలికి రాకూడదు అని ఆర్డరు వేసేయనూ!" అని ఆమె ముక్కు పుచ్చుకుని వూపి లేచాడు ఆనందరావు.

"ఇంతకీ నీ కే పిల్ల కావాలోయ్?" అన్నాడు మళ్ళీ దగ్గిర కొచ్చి.

"ఛీ. ఛీ. అవేం మాటలు!" సిగ్గుపడింది పద్మావతి.

"అదికాదు మాడమ్. వీళ్ళు రెడీమేడ్‌గదా! మగపిల్లాడయితే హాయిగా బాధ ఉండదు........వెడదాంరా నువ్వు కూడా!"

ఒక్కసారి ఆలోచించి, "నేను రానులెండి—వచ్చినకాడినుంచి ఒకడిని తెచ్చి, మిగిలిన వాళ్ళని అక్కడే వదిలేస్తే నా మనస్సుకి బాధగా ఉంటుంది—వాళ్ళకేదో అన్యాయం చేసేసినట్టు.......అందమయిన కుర్రాడిని—బాబుాలాగా ఉండాలి—తీసుకురండి" అంది.

"ఆల్‌రైట్. రేపు మంచిరోజు" ఈలేసుకుంటూ వెళ్ళిపోయాడు ఆనందరావు.

అతనివంకే చూస్తూండిపోయింది పద్మావతి.

పరుగెత్తుతున్న ఆలోచనలని బలవంతాన ఆపుకుంటోంది.........ఎటువంటివాడు వస్తాడో—ఎలా ఉంటాడో? ఎంతగా అనాథ అయినా తన దగ్గరకు వచ్చినాక వాడు దిక్కులేనివాడు ఎలా అవుతాడు!

తనవాళ్ళంతా హేళన చేస్తారేమో? చేయనీ తనకి మాత్రం భయం ఏమిటి?" "జాలేసి పెంచుతున్నాం" అంటుంది తను. ఆ మాటకివస్తే ఇదివరకు ఈ విషయంమీద తనెన్నిసార్లు ఇరుకున పడలేదు.

ఒకమాటు అన్నయ్య మరదలి పెళ్ళికి వెడితే, వదినలు, అక్కయ్యలు అంతా చేరారుకదా అని తనూ కూర్చుంది వెళ్ళి ఆ గదిలో. వాళ్ళ మాటలు అలా అలా పిల్లలమీదికి మళ్ళి ఎవరి పెద్దాడు ఎంత చిలిపివాడయిందీ, చిన్నాడి చురుకుదనం, బుల్లాడి మంకుతనం—వగయిరాలమీద జోరుగా సాగిపోయింది సంభాషణ. తను వింటూ మాటాడేప్పుడు వాళ్ళ కవళికలను చూస్తూ కూర్చుంది. ఎవరికివారే ఇతరుల పిల్లల విషయాలు వింటోన్నట్లే నటిస్తూ, తమ పిల్లల గురించి చెప్పే అవకాశం ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తున్నారు. అది చూసి, తనకి నవ్వొచ్చి ఫక్కున నవ్వేసింది.

"నవ్వుతావమ్మా! నీకేం మొగుడ్ని బుట్టలో పెట్టేశావు. అత్తగారి ఆరడిలేదు. ముఖ్యంగా ప్రాణం తీసి క్షణం తీరిక లేకుండా చేసేందుకు పిల లులేరు. ఏనాడో పెట్టిపుట్టావు ఈనాడు అనుభవిస్తున్నావు" అంది చిన్న వదిన.

తన మనస్సు చివుక్కుమంది. ముఖ్యంగా ఆఖరి మాటలకి. ఏదో వంకచెప్పి లేచి వెళ్ళిపోయింది. తరువాత అన్నయ్య వదినను చీవాట్లు కూడా వేశాడుట పాపం!

పెంచటంలో కనీసం తనూ, మిగిలిన వారితో సమంగా మాట్లాడవచ్చు. ఒక్కొక్కసారి ఈ పెంచుకున్న పిల్లలు వచ్చిన వేళా విశేషం బాగుంటే........సిగ్గుపడి నవ్వుకుంది......

* * * *

గుమ్మంలోనే ఆపి, కుర్రాడ్ని దింపమంది పద్మావతి. నిలబడిన వాడినిచూసి మురిసిపోయింది. గులాబిపూలు మింగినట్లుగా బుగ్గలంతా ఎరుపే! పైగా సొట్టలు.

వాళ్ళిద్దరివంక నిశితంగా చూస్తున్న ఆనందరావు తృప్తిగా నిట్టూర్చి, లోపలికి వెళ్ళబోయాడు.

"ఆగండి, కలిపి దిష్టి తీయాలి" అని ఇద్దరినీ నిలబెట్టి గుప్పెడు ఉప్పు తీసేసింది. వాడిని దగ్గరగా తీసుకుని, "నీ పేరేమిటి బాబూ" అనడిగింది.

వాడు బిక్కముఖంపెట్టి, ఆమెనుంచి తప్పించుకునేందుకు ప్రయత్నిస్తూ, "మాధవ" అన్నాడు.

"దొరబాబులా ఉన్నాడు" అంది ఆనందరావుతో.

మాట్లాడకుండా షర్ట్ బటన్స్ విప్పుకుంటూ, నిలబడ్డాడు ఆనందరావు.

ముద్దుపెట్టుకోబోయింది పద్మావతి మాధవుడ్ని. ఆమెని ఒక్కతోపు తోసేసి, ఏడుపుముఖంతో ఆనందరావు దగ్గరకు పరుగెత్తాడు వాడు.

"తప్పునాన్నా! అమ్మ బిస్కట్లు పెడుతుంది వెళ్ళు" అన్నాడు ఆనందరావు. కాని వాడు అతని పాంటు పట్టుకుని అలానే నిలబడ్డాడు.

పద్మావతి వాడిని మచ్చిక చేసుకునేందుకు వాడి రాక కోసం ప్రత్యేకంగా చేసిన తినుబండారాలు పట్టుకొచ్చి, "మాధవా, ఇటు రా. తాయిలాలు పెడుతా" అని పిలిచింది.

"ఊహు నేను రాను" అన్నాడు వాడు బుంగమూతి పెట్టి.

"నువ్వు రాకపోతే నేనే వస్తాను నీ దగ్గరకు" అని వాడిని బలవంతంగా లాక్కుని ఒళ్ళో పెట్టుకుని ఒక్కొక్కటి నోటికి అందిస్తూ, "చూడు నాన్నా, నన్ను ఇకనుంచి 'అమ్మా' అని పిలవాలి. ఆయన్ని "నాన్నగారు" అనాలి. తెలిసిందా? నీకేం కావలసినా నన్నడగాలి" అంది.

కాని వాడివేమీ వింటంలేదు. తినడంలో నిమగ్నమయిపోయాడు.

"ఎతంట వయస్సు?" అనడిగింది ఆనందరావుని.

"నాలుగోఏడు"

"ఖచ్చితంగా తెలుసా మీకు?"

కొంచెం తటపటాయించాడు ఆనందరావు. "వాళ్ళు చెప్పడమేకదా! మన కెలా తెలుస్తుంది? పుట్టిన తేదీ ఇవ్వరు గాని, వయస్సుమాత్రం సుమారుగా ఇస్తారు. వీడి విషయంలో పుటి న తేదీ కూడా ఇవ్వగలిగారు.

"చిన్నినోరు సున్నాలాగాఉంది వెధవాయిది! ఈ లడ్డు ఎలా పడుతుందో వీడి నోట్లో!" అని పకపక నవ్వింది.

తన్నేదో ఎక్కిరించేస్తోందని అనుమానం వేసినట్లుంది. వాడు గభాలున లేచి, ఏడుస్తూ, ఆనందరావు దగ్గరకు పరుగెత్తాడు.

ఇద్దరూ నవ్వుకున్నారు.

"ఇక వాడికి తైర్‌కొట్టి వశపరుచుకో. నా డ్యూటీ అయిపోయింది."

ఎలాగయినా వాడిని పూర్తిగా వశపరుచుకుని, తనే సర్వస్వంగా వాడు తనమీద ఆధారపడితే బాగుండునని ప్రయత్నించసాగింది పద్మావతి. వాడికి రక రకాల బిస్కట్లు పెట్టడం, వాడు ఏ వస్తువువంక చూస్తుంటే అది వాడికి తెచ్చిఇవ్వడం వంటివి ఇందుకు ఆమె ప్రయత్నాల్లో కొన్ని. వాడిని వెంటేసుకుని బట్టలకొట్లన్నీ తిరిగి, రక రకాల బట్టలుకొని కుట్టేది. కాని, వాడు రాను రాను తనకు దగ్గర రాకపోగా, దూరం కూడా అవుతున్నాడేమోనని అనుమానపడసాగింది ఆమె.

కేవలం తనేమయినా అంటుందేమో నన్నట్టు తాను తినమన్నవన్నీ తినడం, వేసుకోమన్నవన్నీ వేసుకోవడం తప్ప, నోరు తెరిచి ఏదీ కావాలని వాడు అడగకపోవడం పద్మావతికి

ఎంతో లోపంగా అనిపించేది. వాడు తన వేదో దూరం చేస్తున్నట్టుగా బాధపడసాగింది.

ముఖ్యంగా ఆమె ప్రయత్నించినా సాధించలేనిది వాడి చేత "అమ్మా" అనిపించుకోవడం. ఎలాగయినా వాడిచేత ఆమాట అనిపించుకోవాలని ఒక్కొక్కసారి చాలా తీవ్రంగా ప్రయత్నించేది. ఒకరోజున అన్నం పెట్టడం మర్చిపోయినట్లుగా తనమట్టుకు తను చదువుకుంటూ కూర్చుంది. కాని చెవులు మాత్రం వాడి పిలుపుకోసం ఎదురు చూస్తున్నాయి.

వాడు విసుగు పుట్టేంతవరకు బొమ్మల్ని ముందేసుకు కూర్చున్నాడు. ఇక అక్కడినుంచి ఆకలి ఎక్కువయినట్లుంది— లేచి, మెల్లగా ఆమె దగ్గరకెళ్ళి నిలబడ్డాడు. పట్టనట్లుగా చదువుకోసాగింది. ఇక లాభం లేదనుకున్నట్లున్నాడు. తలవంచుకుని, "ఆకలేస్తోంది" అన్నాడు మెల్లిగా

వాడి పట్టుదలకి నవ్వొచ్చింది పద్మావతికి. కాని మళ్ళీ వాడు మాట్లాడక పోయేసరికి తలెత్తి వాడివంక చూసింది.

ఎర్రటిముఖం వాడిపోయిన గులాబి పువ్వులాఉంది. కాళ్ళు బలువుగా వాలుతున్నాయి. జాలేసింది. తనమీద తనకే కోపం వచ్చింది పద్మావతికి.

గబుక్కునలేచి "పద నాన్నా మరిచిపోయాను" అంటూ వెంటబెట్టుకుని తీసుకుపోయింది లోపలికి.

వాడు వచ్చిన రోజునే వెంటేసుకుని చుట్టుపక్కల తా తెలుగున్న వాళ్ళ అందరి ఇళ్ళకు తిప్పింది. ఆమాట విన్న ఆనందరావు నవ్వుతూ అన్నాడు, "నువ్వేదో కొత్త వస్తువు కొనుక్కున్నట్లుగా ఆ ప్రదర్శన ఎందుకో? వాడెవడంటే ఏం చెప్పావుమరి?"

"ఇందులో ఎగ్జిబిషన్ ఏముందిట? ఇకనుంచి వీడు మా అబ్బాయి—తెలుసుకోనండహో అని చెప్పి వచ్చాను— అందులో తప్పేముందిట? పెళ్ళిలో మనిద్దరినీ ఎందుకుట కారులో ఎక్కించి వూరంతా వూరేగించారు—"ఇదుగో ఈ అమ్మాయి ఇకనుంచి ఈ అబ్బాయితో తిరుగుతూంటుంది. వాళ్ళు మీకంటబడినప్పుడు మరేమీ అనుకోకండి" అని చెప్పేందుకు. అలాగే ఇదీను" అని కాసేపాగి, "అందరూ ఏమన్నారో తెలుసా?" అనడిగింది.

"మీ అబ్బాయి కబుర్లేకానీ, నాకు కాఫీ ఏమయినా—"

"చెప్పేది వింటేనే!.......అచ్చం వాడు మీ పోలికేనట. "ముమ్మూర్తులా మీ ఆయన పోలికేనమ్మా పద్మా! అసలెందుకు, నువ్వు చెబితే తెలుసుకుంటారుగాని లేకపోతే నీ సొంత కొడుకే ననుకుంటారు" అంది మా సూర్యం అత్తగారు. అందరూ అదేమాట!"

"అయితే వాడిఖర్మ. వాడినీ, నన్నేడిపించినట్లే ఏడిపిస్తున్నమాట!" అన్నాడు ఆనందరావు నవ్వుతూ.

"అబ్బో! మీ ప్రాణం తీస్తున్నానుకదూ?......... వాడంటే అందుకే నాకు అంత ప్రేమ!" అంది గోముగా అతని వంకచూసి.

"ఇంతకీ 'అమ్మా' అనిపించుకున్నావా?"

"మిమ్మల్ని 'బాబాయి' అనిపించుకుంటున్నారుగా—నన్నా 'పిన్నీ' అంటాడు కాబోలు" కొంచెంసేపు ఎవరూ మాట్లాడ లేదు తరువాత.

"అయితే మీ చెల్లెలి పెళ్ళికి వీడినీ తీసుకు వెడతున్నావా—ఆ అభిప్రాయం మార్చుకున్నావా?" అనడిగాడు ఆనందరావు.

"అంత అనుమానం ఎందుకు వచ్చిందో? నేను వెడుతుంటే వాడు రాడూ! అయినా " తీసుకు వెడుతున్నావా" అంటున్నారు దొరగారు దయ్యచెయ్యరా?"

"అదికాదు పద్మా—వాడిని తీసుకెడితే నీకు లేనిపోని బాదరబందీ. పైగా........బాగుండదేమోనని"

"ఏరేం బాధలేదు—నాకు లేని దిగులు మీకెందుకుట?"

*　　　*　　　*　　　*

ఊరెళ్ళి తిరిగిన వచ్చిన పద్మావతికి తల పగిలిపోతోంది. ఆలోచనలతో..........అందరూ ఒకే మాట "అచ్చం మీ ఆయన పోలికేనే వీడు" అని.

తన భర్త చిన్నతనం తెలిసిన ఇద్దరు ముగ్గురు బామ్మగార్లు "మా ఆనందు ఇలాగే ఉండేవాడే పద్మా— అచ్చం వాడి నోటిలోనుంచి వచ్చినట్లున్నాడు ఈ వెధవాయి. గుమ్మడి పండులాగా ఉండేవాడు మీ ఆయన ఇప్పుడంటే నీ చేతి వంట తిని శల్యమయిపోయాడుగానీ—" అని అంటుంటే తనూ నవ్వేసింది మొదట.

కాని అందరూ అదే మాటంటుంటే దాన్ని గురించి ఆలోచించింది **తను** కూడా. పరిశీలనగా చూసింది వాడిని. "నిజమే—**వాళ్ళన్నకొంట్లో** ఏమాత్రం అబద్ధంలేదు. ముమ్మూర్తులా ఆయన **పోలికే** వీడు" అనిపించింది తనకి కూడా.

అయితే అప్పట్లో తను ఆలోచించింది అంతవరకే. తనతో అంతలా కలిసి పోయేలా మాధవు డున్నందుకు సంతోష పడింది కూడా.

అయితే తన ఆలోచనలని మరోవైపుకు మరల్చింది నీరజ. అది ఆయనకి వరసకి మరదలు. తనకి స్నేహితురాలు......

"పూర్తిగా మీ ఆయన పోలికేనే నీ కొడుకు. ఈ బామ్మగార్లంతా ఇలా ఎవరో పిల్లాడు వాళ్ళ ఆనందులాగానే ఉండడం కేవలం భగవంతుడి లీలని, వీడిని మీ కోసమే ఆ పరమాత్ముడు సృష్టించాడని భ్రమపడుతున్నావు. కాని, అమ్మడూ, నాకేం నమ్మకంలేదు. ఏమన్నాఅంటే నాలాంటి వాళ్ళని నాస్తికులని తీసిపారేస్తారు. కాని, కొంచెం డీప్‌గా ఎందుకు ఆలోచించరో? ఇది మీ ఆయన లీలే ఎందుకు కాకూడదూ? ఏం, ఆయనమాత్రం బొత్తిగా అమాయకుడా? పైగా ఇంకో విషయం జ్ఞాపకంఉందా—నువ్వే చెప్పావునాకు. మాధవుడు కూడా అతని దగ్గరే చనువుగా ఉంటున్నాడు.......

అరుగో మీ ఆయనగారు దయ చేస్తున్నారు. బావగారండోయ్, మీ శ్రీమతికి నిన్ను గురించి కొన్ని నగ్న సత్యాలు చెబుతున్నానోయ్!" అంది.

నీరజ మాటలు విని, తను మొదట తెల్లబోయింది. దానిమీదకోపం కూడా వచ్చిందికాని, ఆ ఆలోచనమాత్రం తన మనసుని దొలచసాగింది. గతంలోని సన్నివేశాలు మళ్ళీ గుర్తుకు వచ్చాయి. అవన్నీ కూడా నీరజ చెప్పిన మాటలని బలపరిచాయి.

నిజమే మరి—అసలు పిల్లాడిని పెంచుదామన్న ప్రసక్తి తెచ్చినది ఆయన. మగపిల్లాడని పెంచుకుందామన్నదీ ఆయనే! వాడిని అక్కడినుంచి తెచ్చింది ఆయనే!........ఇదంతా ముందే ఆలోచించి ఉంచుకున్న పథకం ప్రకారం జరిపించారన్నమాట. తనేమో పిచ్చిదానిలాగా సంబరపడిపోయింది. నీరజ చెప్పింది రైటే—మాధవుడు తన దగ్గర ఇంతవరకు చనువు కాలేదు తను ఎంతగా ప్రయత్నించినా. అటువంటిది ఆయన దగ్గర మొదటినుంచీ కూడా మాలిమి అయాడు—'బాబాయి' అని పిలుస్తాడు. తను మొదట్లో వాడిని పక్క ఇళ్ళవాళ్ళకి చూపించి, "మీ పోలికే నంటున్నారండి" అంటే ఆయన మాట మార్చేశారు........ఆలోచిస్తున్నకొద్దీ పద్మావతికి మంచు విడిపోయినట్లుగా స్పష్టంగా అగపడుతోంది. తనెంతగా మోసపోయిందీ" అనుకుని పదోసారి ఆశ్చర్యపోయింది.

"ఇంటికి రాగానే తేల్చేసుకోవాలి. ఈ నాటకం అనుభవించలేదు. వాడిని చూస్తుంటే తనకి జరిగిన అన్యాయానికి వాడు ప్రతిబింబంగా అనిపిస్తోంది. వాడిని తని ఇంట్లో భరించలేదు"..........ఏం చేయాలో, ఏమి చెప్పాలో పూర్తిగా ఆలోచించుకుని నిర్ణయించుకుంది. మెత్తమెత్తగాభర్తచెప్పబోయే మాటలకు తను లొంగిపోకుండా ఉండేందుకు అసలు అతనిమాటలు వినకూడదని కూడా నిర్ణయించుకుంది.

తనకి కావలసినదల్లా ఒక్కటేమాట—వాడికీ ఆయనకి ఏమిటి సంబంధం? నలుగురూ అనే మాటల్లో ఎంతవరకు నిజం ఉంది?........బోనులో పెట్టిన పులిలా అటూ ఇటూ తిరగసాగింది అతని రాకకై ఎదురుచూస్తూ.

"హల్లో పద్మావతీదేవీ, తిన్నది అరగలేదా ఏమిటి పచార్లు చేస్తున్నావు?" అన్నాడు ఆనందరావు లోపలికి వస్తూనే.

గబుక్కున అతనివైపుకు తిరిగి "వాడు మీకు ఏమవుతాడు చెప్పండి?" అనడిగింది తీక్షణంగా.

గతుక్కుమన్నాడు ఆనందరావు. "ఎవడు?" అనడిగాడు.

"వాడే—కుర్రాడు—మాధవుడు"

"నీకేమవుతాడో నాకూ అదే—"

"అదికాదు నే నడిగేది. ప్రత్యేకించి, మీ కేమవుతాడు" అని.

అతను మాట్లాడలేదు.

"నాకు తెలుసు—దానికి మీరేమీ సమాధానం చెప్పరని! కాని, ఒక్కటిమాత్రం వినండి—నా కళ్ళు మూసినా, మీరు లోకం నోరు మూయలేరు. మీరు చెప్పిన కథలన్నీ నమ్మి, మీరు ముందే వేసుకున్న ప్లాను ప్రకారం నడవటానికి నాలాటి తెలివి తక్కువ వాళ్లే కావాలి......... చదువుకున్న చదువును బ్రహ్మాండంగా వాడుకున్నారు. ఉన్న తెలివినంతా నన్ను మోసం చేయడంలోనే ఉపయోగించారు పాపం!"

ఆనందరావు కాసేపు ఏమీ మాట్లాడలేదు. తరువాత వెళ్ళి ఒక కవరు తీసుకొచ్చి, ఆమెకిచ్చి "ఇది చదువు" అని చెప్పి బయటికి వెళ్ళిపోయాడు.

గబగబ చింపి, ఉత్తరం చదవసాగింది పద్మావతి.

"అనుకున్న రోజా, ఎదురు చూసిన ప్రశ్న—రెండూ వచ్చాయి. ఈక్షణం ఎప్పటికయినా వచ్చి తీరుతుందనే ఉత్తరం రాసి సిద్ధంగా ఉంచుకున్నాను. మనుష్యుల్ని ఎదట అర్థం చేసుకోవడంకన్నా, ఉత్తరాల ద్వారా తేలిక. చెప్పడం కూడా అంతే. క్షమించగలగడం కూడను!

అవును—వాడు నా కొడుకే! విన్నదాని మీద నువ్వు వూహించినది నిజమే!

కాని ఇది మన వివాహంకాని క్రితం సంగతి—

ఈ ఉద్యోగంకోసం నేను మద్రాసులో ట్రయినింగయానని చెప్పాను నీకు లోగడనే. అప్పుడే నాకు పరిచయమయింది జయ.

ఆమెపేరు జయలక్ష్మి. ఎమ్మెస్సీ పాసయి మద్రాసులోనే ఒక కంపెనీలో కెమిస్ట్‌గా పని చేస్తుండేది. ఆమెకి తల్లి తండ్రి ఇచ్చిపోయిన ఆస్తి ఏమీలేదు చదువుతప్ప. ఇకపోతే వీరివలన ఆమెకు కలిగిన అదృష్టం వివాహం లేకపోవడం. వాళ్ళదీ ప్రేమ వివాహమే! కులాలువేరు, భాషవేరు వాళ్ళది. ఒకరు తెలుగు, ఒకరు అరవం. అందువలన ఆమెకి విశాల భావాలయితే నేర్పగలిగారుగాని, ఒక కులం అంటూ ఇవ్వలేకపోయారు. దాని కప్పిపుచ్చుకునేందుకనే తల్లిపోయినా తండ్రి ఈమెని చదివించాడు. కూతురు స్వతంత్రంగా ఉద్యోగం చేయడంచూసి, ఆయన కళ్ళు మూశాడు. కాని, ఆయన కూతుర్ని ఒక ఇంటిదాన్ని చేయలేకపోయాననే దిగులు మాత్రం ఉండేదిట !

జయకి, నాకు పరిచయం అయింది ఉద్యోగ రీత్యానే. కేవలం ఆమె అందం నన్ను ఆకర్షించిందని చెబితే ఆమెకు అన్యాయం చేసినవాడినే అవుతాను.

నిండు కుండలాంటి మనిషి, ఏ విషయంలోనూ తొందరపడి మాట్లాడేదికాదు. ఎప్పుడూ పెదవులమీద చిరునవ్వు తాండవిస్తుండేది.......'భార్య' అవబోయే మనిషికి ఏ ఏ లక్షణాలుండాలని కలలు కంటుండేవాడినో అవన్నీ మూర్తీభవించినట్లుండేది జయలక్ష్మి. అందుకనే ఆమె నన్ను అమితంగా ఆకర్షించింది.

ఆమె నాలో ఏంచూసి నేనంటే ఇష్టపడిందో నాకయితే తెలియదుగాని, ఆమె మాటల్లోనే చెప్పాలంటే "మీలాంటి సహృదయుడు దొరకడం నా అదృష్టం. మా నాన్న ఉంటే ఎంతగా సంతోషపడేవాడో" అనేది.

'ప్రేమ' అన్నది వయస్సులోవున్న యువతీ, యువకులమధ్య కలిగినప్పుడు అది కేవలం మనస్సులకే పరిమితం అయిఉండటం అసంభవం. అందుకే ననుకుంటా మన పూర్వీకులు దీన్ని నిరసించారు.

మా ప్రేమ ఫలించిందని, జయ తల్లి కాబోతోందని తెలిసినప్పుడు నేను అమితంగా ఆనందించాను. మనస్సాక్షిగా చెబుతున్నాను, సంతోషపడ్డానని. కథల్లోని నాయకుల్లాగా "ఎలా ఈ బెడద వదిలించుకోవడం" అన్న ఆలోచనే రాలేదు నాకు ఎప్పుడూ కూడా.

"మా అమ్మావాళ్ళకి తెలియబరుస్తాను జయా మన విషయం" అనేవాడిని. కాని జయలక్ష్మి అందుకు ఒప్పుకునేదికాదు.

"మీమీద నాకు నమ్మకంఉంది. మీరు నన్ను అన్యాయం చేయరన్న ధైర్యం ఉంది. అటువంటప్పుడు ఎందుకు తొందరపడాలి? అవతల మీ చెల్లెలికి పెళ్ళి చేయాలనుకుంటున్నారని చెప్పారాయె. మన పెళ్ళి సంఘం మెచ్చేదికాదు. నేను కులంలేనిదాన్ని కాబట్టి, ఇప్పుడు మన విషయం చెప్పి, వాళ్ళు ఇష్టపడినా, పడకపోయినా నన్ను చేసుకుంటారనుకోండి! దానివలన మీ చెల్లెలి భవిష్యత్తు ఏమవుతుందో ఆలోచించండి!" అనేది.

"అయితే ఏం చేయమంటావు" అనే వాడిని అయోమయంగా.

ఫక్కున నవ్వేసి, "ఆఫీసరు కాబోతున్నారు—ఆడపిల్ల చెప్పాలా ఏం చేయవలసినదీనూ! భలేవారే, మీ చెల్లెలిపెళ్ళి అయేదాకా ఇలాగేఉందాం. అప్పుడు మన విషయం చెబుదురుగానీ!" అనేది.

"పోనీ, రిజిష్టర్ మారేజి చేసుకుందాం."

"నామీద మీకు నమ్మకంలేదా?"

"ఛ, అవేం మాటలు"

"మీరంటే నా కెటువంటి అనుమానంలేదు., ఎందుకు మనకి తొందర?"

ఇక జయతో వాదించలేక వూరుకునేవాడిని. ఈ విషయం ఎన్నిసార్లు ప్రస్తావించినా సంభాషణ ఇక్కడితోనే ఆగిపోయేది. చివరికి జయలక్ష్మి నవ్వుతూ, "మీరు ఉట్టి పిచ్చివారు. నాకేదో అన్యాయం జరగవచ్చునన్న ఊహే మీ కెంత భయం కలిగించుతోందో? మీలాంటివారు చేయాలన్నా మోసం చేయకలరా" అనేది.

ఆరు నెలల ట్రయినింగుతో మద్రాసు వదిలి వచ్చేశాను. నన్ను ధైర్యంగా ఉండమని మరీ మరీ చెప్పి సాగనంపింది జయలక్ష్మి. నాకు విచారంలో కూడా నవ్వు వచ్చింది" తనకి నేను చెప్పవలసిందిపోయి, నాకు ఆమె చెబుతుందేమా" అని.

చివరిసారి—మా వాళ్ళకి చెప్పేస్తానని అని, మళ్ళీ ఆమె చేత ఆ మాటలన్నీ చెప్పించుకుని బండి ఎక్కాను.

మా చెల్లెలి పెళ్ళికి నేనే తొందరపడి సంబంధాలు వెదికాను. కాని దానికి ఆశలు ఎక్కువ. దానికితోడు నాన్నగారి స్తోమతు కూడా పెద్దదే కావడాన "గొప్ప భవిష్యత్తు" ఉన్న కుర్రాళ్ళని వేటాడలేక నామచ్చుమాసేది. నా దురదృష్టమే అనుకుంటూ దానికి త్వరగా సంబంధం స్థిరపడక పోవడం.

దానికి తీరా సంబంధం అదీ కుదిరి పెళ్ళి జరిగిపోయి ఇక మనకి ఏ అడ్డంకిలేదు అనుకుంటుంటే జయలక్ష్మి దగ్గర నుంచి వెంటనే రమ్మనమని ఉత్తరం వచ్చింది.

నేను వెళ్లేసరికి అంతా అయిపోయింది. వీడుమాత్రం దక్కేడు నాకు.

ఆమె పోకుండా ఉంటే వెంటనే మా వాళ్ళకి చెప్పేద్దామనుకున్నాను నేను. కాని నా కా అదృష్టంలేదు.

'మాధవుడు' అని పేరు పెట్టుకున్నది జయలక్ష్మి. మొదట నాకు వాడిని ఏం చేయాలన్నది తోచలేదు. నేరుగా ఇంటికి తెచ్చేసి, "జరిగినదిది, వీడు మీ మనవడు" అని చెబుదామనుకున్నాను. కాని, నా విషయం పూర్తిగా తెలిసిన మా గోపాలరావు సలహామీద వీడిని ఒక అర్ఫనేజిలో చేర్పించాను—అనాథగా మాత్రంకాదు. డబ్బిస్తుంటే వాళ్ళు వీడిని జాగ్రత్తగా చూసేట్టు ఏర్పాటు చేశాడు గోపాలరావు. అక్కడ మూడు సంవత్సరాలుంచిన తరువాత తీసుకొచ్చి ఒక స్కూల్లో చేర్పించాను. అక్కడ హాస్టల్ కూడా ఉంటుంది స్కూలుతోపాటు. గురుకులంలాంటి దన్నమాట అది. మనం డబ్బు కడుతూఉంటే వాళ్ళకి మంచి శిక్షణతోపాటు చదువు కూడా నేర్పుతారు.

"నీకు పెళ్ళిఅయి, మీ ఆవిడ మంచిదయితే వీలునిబట్టి, ఆవిడకి నచ్చజెప్పి, వీడిని తీసుకెళుదువుగాని. అలా వీలులేదంటే తరువాత ఆలోచిద్దాం. నేను ఈలోగా వాడి విషయం కనుక్కుంటూ ఉంటాను. డబ్బు మనం పడేసినంతకాలం ఏలోపం రాదనుకో! ఇంట్లోకన్నా బాగా చూసేట్టు చేసే బాధ్యత నాది!" అన్నాడు గోపాలం.

ఆనాటినుంచి నీమీద ఆశ పెట్టుకుని ఉన్నాను నేను. నీతో అంటే కాదనవనిపించేది. దానికితోడు నీకు పిల్లలంటే ఉన్న మక్కువ నాకు కొండంత ధైర్యం కలిగించింది.

'స్వార్థం' అంటావు. నేను కాదనను. కాని, ప్రేమ అటువంటిది. వాడిని అన్యాయం చేస్తున్నానన్న బాధ! అందుకే వాడిని ఇంటికి తెచ్చాను. వాడిమీద నువ్వు చూపే ఆదరణచూసి, అదృష్టవంతుడు వీడు అనుకున్నాను"......

చదవడం ఆపేసింది పద్మావతి. ఆమె శరీరం కోపంతో వేడెక్కిపోయింది. గబగబ అతనికోసం గదిలోకి వెళ్ళిందికాని లేడు. గిరుక్కున వెనక్కి తిరిగింది. ఎదురుగా కనబడ్డాడు ఆనందరావు.

నున్నపు రాయిమీద నీళ్ళు పడినట్లయింది.

"నేనేం చేశానని నాకు మీరింత ద్రోహంచేశారు? నా ఒక్క దానికే మీ హృదయంలో స్థానం ఉన్నట్లుగా నటించారు ఇన్ని రోజులు—ఎంత గ్రంథసాంగులు! నేనే వెర్రిదాన్ని—"ఈ మనిషి వెనక ఇంత చరిత్ర ఉంది" అని తెలుసుకోలేకపోయాను. అసలు మగజాతిని నమ్మడంలోనే ఆడది తన తెలివి తక్కువ దనాన్ని చూపిస్తోంది. పైగా జరిగింది చాలక మీ 'ప్రేమ ఫలాన్ని' తీసుకొచ్చి నా నెత్తిన రుద్దడం కూడనా?"

"పద్మావతీ!" అన్నాడు బాధగా ఆనందరావు.

కాని ఆవిడ ఇంకా రెచ్చిపోయింది. "అవును, ఉన్న మాటలంటే ఖంగారు పడతారెందుకు? నిజం చెప్పి నన్ను ఒప్పించే ధైర్యం, ఆత్మ విశ్వాసం లేక నా నెత్తిన వాడిని రుద్దారు. ఎవరికో పుట్టిన........"

"పద్మ, తొందరపడుతున్నావు. నీ అంత సభ్యతగల కుటుంబంలోనిదే ఆ అమ్మాయి"

"అవు నవును—తెలుస్తూనేఉంది. వాళ్ళ అమ్మది నాన్న కులం కాదుట. వాళ్ళద్దరి కులం ఈవిడదికాదుట. భాష ఏదో తెలియదుట. పెళ్ళయినా లేకుండా ఉద్యోగం వెలగబెడుతూ ఉండడం చాలక, మీలాంటివాళ్ళని వలలో వేసుకుని పిల్లల్ని కనడం! దానికి 'ప్రేమ' అన్న పేరు పెట్టడం. అడ్డమయిన బజారు పిల్లల్ని సాకేందుకు......"

మాట పూర్తి కాకుండానే చెంప చెళ్ళుమంది. రెండు, మూడు........కొట్టేస్తున్నాడు పిచ్చగా ఆనందరావు.

నిద్రలేచి, గదిలోంచి బయటకొచ్చిన మాధవుడు ఆ దృశ్యంచూసి, హడలిపోయి, బావురుమని ఏడవడం మొద లెట్టాడు.

తను చేస్తున్నపని తెలిసొచ్చి గబుక్కున తలవంచుకుని వెళ్ళిపోయాడు ఆనందరావు.

జీవితంలో జరగని పని జరగడంతో మొదట తెల్లబోయిన పద్మావతి బాధతో, అవమానంతో ఏడుస్తూ వెళ్ళిపోయి మంచం మీద పడిపోయింది.

మాధవుడు ఏడుస్తూనే నిలబడిపోయాడు వంటరిగా.

కొంతసేపు గడిచాక, ఆనందరావు మెల్లగా పద్మావతి దగ్గరకు వెళ్ళి నిలబడ్డాడు.

ఏడుస్తూ బెక్కుతూన్నట్లుంది—వీపు ఎగిరి ఎగిరి పడుతోంది. నీరయిపోయాడు ఆనందరావు......గబుక్కున వంగి, ఆమెని చేతుల్తో లేవదీయపోయాడు. కాని, తన చేతులు తననే వెక్కిరించినట్లు కనబడేసరికి వాటిని వెనక్కి పెట్టేసు కుని "పద్మా" అని పిలిచాడు.

తలెత్తి ఒకసారి అతనివంకచూసి మళ్ళీ దిండులోకి పెట్టేసుకుంది. బుగ్గలు ఎర్రగా కందిపోయాయి. వాటి మీద కన్నీళ్ళ తడి ఇంకా ఆరలేదు.

బాధపడిపోయాడు ఆనందరావు. తను ఇంతవరకు వూహించనంత మూర్ఖంగా ప్రవర్తించాడు అనిపించిందతనికి. వెంటనే "నన్ను క్షమించుపద్మా, పశువులాగా ప్రవర్తించాను. నేను సిగ్గుపడుతున్నాను ఇప్పుడు. నా జీవితంలో మళ్ళీ ఇటు వంటి పని చేయనని ప్రమాణంచేసి చెబుతున్నాను.

ఈరోజు నేను క్యాంపుకి వెడుతున్నాను. మూడు రోజుల్లో తిరిగివస్తాను. అంతవరకు వాడిని........మాధవుడిని ఉండ నీయి. అది నీకు బాధ కలిగిస్తుంది—తెలుసు నాకు. కాని, నా కోసం ఈ మూడురోజులు ఉండనీ వాడిని. నేను తిరిగి రాగానే తీసుకువెళ్ళి మళ్ళీ ఆ బడిలో దింపివస్తాను. అక్కడ కూడా బాగా చూస్తారు.

సరే, మరొక్కసారి చెబుతున్నాను—నన్ను క్షమించు చాలా అసహ్యంగా ప్రవర్తించాను" అని గిరుక్కున తిరిగి గది లోంచి బయటికి నడిచాడు.

గుమ్మంలో నిలబడి ఉన్నాడు. మాధవుడు ఏడుస్తూ. కడుపులో చేయిపెట్టి దేవినట్లయింది ఆనందరావుకి. వాడిని దగ్గరకు తీసుకోపోయాడు. కాని, వాడే అతని చేతుల్లోంచి తప్పించుకుని దూరంగాపోయి నిలబడ్డాడు. ఇక వాడిని చూడ లేక ఆనందరావు పెద్ద పెద్ద అంగలతో బయటికి వెళ్ళిపోయాడు.

* * * *

తను ఎంత సేపటినుంచీ పడుకునుందో పద్మావతికి తెలియదుగాని, తనకి తెలియని కొత్త పిలుపువిని కళ్ళు విప్పి చూసింది.

పక్కనున్న బల్లమీద నిలబడి తనవంక చూస్తున్నాడు మాధవుడు.

జరిగినదంతా గుర్తుకొచ్చి తల తిప్పేసుకోబోయింది పద్మావతి. కాని......

"అమ్మా!" అన్నాడు మాధవుడు మళ్ళీ.

గభాలున కళ్ళు తెరిచి వాడివంక చూసింది. వాడు తన ముఖంలోకే ఆతృతగా చూస్తున్నాడు. వాడి బుగ్గలమీద ఏడ్చిన గుర్తులు బాగా అగుపిస్తున్నాయి.

"అమ్మా, బాబాయి వెధవ!" అన్నాడు ఆమె ముఖం లోకే చూస్తూ.

ఆమె వాడు చెప్పే మాటలన్నీ పట్టించుకునే స్థితిలో లేదు. తన కిన్నాళ్ళు తెలియని, కొత్తదయిన ఆ పిలుపు—తనిన్నా ళ్ళుగా ప్రయత్నంతో సాధించలేనిది విని ఆశ్చర్యంతో వాడివంకే చూస్తూ ఉండిపోయింది. పన్నీటి చిలకరింపులా ఉంది ఆ పిలుపు ఆమె హృదయానికి.

"బాబాయి రాచ్చసి, కదూ అమ్మా!" అన్నాడు వాడు మళ్ళీ—ఆమె నెలాగయినా మాట్లాడించాలని.

ఆమెకు అర్థం కాలేదు "ఎందుకు?" అనడిగింది.

"అందరినీ కొడతాడు. రాచ్చసి. రౌడీ!"

కొట్టడం అనగానే మళ్ళీ ఇందాకటి సన్నివేశం గుర్తు కొచ్చి తిరిగి పడుకుంది.

రెండు మూడు సార్లు ఆమెని మాట్లాడించేందుకు ప్రయత్నించాడు మాధవుడు "బాబాయి జల వచ్చి" అంటూ. కాని ఆమె బలవంతాన వాడిమీద కోపం పెంచుకుని "మాట్లాడ కూడదు" అనుకుంది.

మనస్సుమాత్రం మళ్ళీ ఒక్కసారి "అమ్మా" అని పించుకోవాలని తహతహ లాడింది. అయినా నిగ్రహించుకు నేందుకని "వెధవ, దీనికంతటికీ వీడే కారణం" అనుకుంది. కాని, మనస్సు సమాధాన పడలేదు. బలవంతాన ఆలోచనలని మళ్ళించుకోవాలని అదే మాటని పదేపదే అనుకుంటూ, అలాగే మగత నిదరపోయింది. "అమ్మాయి పద్మావతీ, ఒళ్ళు ఇలా కాలి పోతుంటే నిద్రపోతున్నా వేమిటమ్మా! తప్పుకాదూ? ఈ వెధవాయికి నీమీద ఎంత ప్రేమసుకున్నావు—ఎలా కనుక్కున్నాడో నీకు జ్వరం వచ్చినట్టు. నా దగ్గరకువచ్చి, బిక్కముఖంపెట్టి, "మా అమ్మకి జలం" అన్నాడు. "మీ నాన్న ఏమయ్యాడురా" అనడిగాను. "లేడు" అన్నాడు. సరేనని ఆ వళాన మా వాడిని డాక్టరుగారి దగ్గరకు పంపించి ఇటొచ్చాను" అంటూ చెప్పింది పక్కింటి పిన్నిగారు.

తలనెప్పి పగిలిపోతోంది పద్మావతికి. కళ్ళని బలవంతాన తెరిచి, "కూర్చోండి పిన్నిగారూ" అందిగాని, ఆమె కళ్ళు మాధవుడికోసం వెదికాయి.

ఇందాకటి స్థానంలోనే బల్లమీద ఎక్కి, ఆమె ముఖం లోకి చూస్తున్నాడు. వాడి ముఖంలో కొట్టొచ్చినట్లు కన బడుతున్న ఆత్రం, భయం చూస్తే పద్మావతికి జాలేసింది.

ఏంచేస్తాడో చూద్దామని చేత్తో నుదురు గట్టిగా పట్టు కుని "ఏరా మాధవా, తల నెప్పిగా ఉందిరా నాన్నా!" అంది.

బావురుమని ఏడవడం మొదలెట్టాడు వాడు—అదేమిటో నని ఖంగారు పడిపోయి.

మనస్సుమీద బలవంతాన వేసుకున్న అంకట్లన్నీ ఒక్కసారిపోయాయి పద్మావతికి. గభాలున చేతులుచాచి, వాడిని దగ్గరకులాక్కొని గుండెలకి హత్తుకుంది.

పిన్నిగారి కళ్ళు చెమర్చాయి. "బాగానేఉంది తల్లీ కొడుకుల పని. నీకేదో అయిపోయిందని వాడేవవడం! అయినా వెధవాయికి తలనెప్పి అంటే ఏమర్థమయిందో?.........అరుగో డాక్టరు గారు వచ్చారు" అంది ఆవిడ.

*   *   *   *

భయంగా, దిగులుగా లోపలికి వచ్చిన ఆనందరావు హాల్లో ఎవ్వరూ కన బడకపోయేసరికి ఖంగారుపడిపోయాడు. లోపలికి వెళ్ళేందుకు భయపడ్డాడు—ఎటువంటి సన్నివేశాన్ని ఎదుర్కొన వలసి వస్తుందోనని.

అడుగులో అడుగు వేసుకుంటూ పడకగది దగ్గర కొచ్చాడు. గుమ్మంలో నిలబడి లోపలికి చూసిన అతనికి నేత్ర పర్వమయిన దృశ్యం అగపడడంతో ఆశ్చర్యపోయాడు.

పద్మావతి పడుకుంది మంచంమీద. మాధవుడు ఆమె పక్కన మంచంమీద కూర్చునున్నాడు. వాడి చుట్టూ చేయి వేసి, ".....బుధవారము, గురువారము, శుక్రవారము, శని వారమూ—ఈ ఏడున్నూ వారముల పేర్లు" అని తను అని, వాడిచేత అనిపిస్తోంది పద్మావతి.

ఆశ్చర్యం పట్టలేక, కలా, యదార్థమా అన్న విషయం రూఢిగా తేల్చుకుందామని "పద్మా!" అన్నాడు ఆనందరావు.

అతన్నిచూసి, గబుక్కున లేవబోయి, మాధవుడు తనని అనుకుని ఉండటం గమనించి, "లే నాన్నా, నాన్నగారు వచ్చారు" అంది పద్మావతి.

యధార్థమే అని బుజువయింది ఆనందరావుకి. "వాడిని ఇవాళే తీసుకు వెడదామనుకుంటున్నాను" అన్నాడు ఎందుకయినా మంచిదని.

"కావాలంటే మీరే వెళ్ళండి—మేం రాము. ఏరా మాధవా?" అంది పద్మావతి.

"ఉహుఁ, రాము. బాబాయి కౌడీ!" అన్నాడు వాడు ఆమెకి వత్తాసిస్తూ.

"ఓరి వెధవా—నేనురా కౌడీని! మరి ఆవిడో?"

"అమ్మ మంచిది!" అన్నాడు మాధవుడు.

ఆనందరావు సంతోషానికి అంతేలేదు "ఇదెప్పటినుంచి?" ఆశ్చర్యంగా అడిగాడు.

"మీరు కొట్టిన దెబ్బలతో వాడూ హడలిపోయాడు. బాధితులం ఇద్దరం రాజీ పడ్డాం. వెధవాయి నాకు జ్వరం వస్తే నన్ను క్షణం వదలలేదు.......పాపం వాడిని గురించి నేను మీతో ఏమన్నానో వాడికేం తెలుసు. అదంతా ఒక పీడ కలను కోండి. క్షమించండి నన్ను!"

"నువ్వే నన్ను క్షమించాలి పద్మా!.......అయినా ఇటువంటి సన్నివేశం చూస్తానని కలలో కూడా అనుకోలేదుసుమీ! మా రాణీగారు మంచిదని నమ్మకంఉన్నా, ఖంగారు పడిపోయాను' అంటూ దగ్గరగావచ్చి, చేతులో ఆమెను చుట్టేయబోయాడు.

అతనినుంచి తప్పించుకుంటూ, "తప్పు, అబ్బాయి!" అంది నవ్వుతూ పద్మావతి.

"ఒరేయ్ వెధవాయ్, పెద్దవాళ్ళున్నప్పుడు పిల్లలు..... ఓ అన్నట్టు పద్మా— వీడు మరీ పిల్లాడుకదా! కొంచెం పెద్దయాక చెబుతాను ఆ మాట. ప్రస్తుతానికి మరేం ఫరవాలేదు" అంటూ ఆమెను దగ్గరకు లాక్కున్నాడు.